# నది నదీ గోస్తనది

అత్తిలి నుంచి అమెరికా వెళ్తే ఎలాగుంటుందో నా చిన్నప్పుడు మా వూర్నించి తణుకు ఐ స్తీకి వెళ్ళినపుడు అలాగనిపించేది. తణుకు పేరు జ్ఞాపకం వచ్చినపుడల్లా నాకు గోస్తనది జ్ఞాపకం వస్తుంది. వంకర నడత కలవారిని అనేకమందిని మనం చూసి వుంటాం, కాని తణుకులో గోస్త నది వారందర్నీ మించిపోతుంది. ఎవరి దొడ్డిగుమ్మం తలుపు తీసినా గోస్త నదే నవ్వుతూ పలకరిస్తుంది. కాలవని నది అంటే ఎవరికైనా నవ్వొస్తుందా రాదా? గోస్తనదిని నది అనకుండా కాలవ అంటె తణుకులో ఎవరికైనా యిట్టే కోపం రావచ్చు.

రేపు పావంచాలమీద కూర్చుని ఆ నీళ్ళలో అలా పాదాలు ముంచగానే గోస్తనది కిలకిలా నవ్వుతూ మాతో కబుర్లు చెప్పడము ప్రారంభిస్తుంది. మాకు కంఠతా వచ్చిన పాటలన్నీ అక్కడే కూర్చుని పాడి గోస్తనదికి వినిపించే వాళ్ళం. మా ఆటలు, మా కబుర్లు, మా నవ్వులూ వింటూ మౌనంగా సాగిపోయే గోస్తనదిని ఎట్లా మర్చిపోవటం ? గట్లను రాసుకుని కొత్త కాలువ పూటుగా వున్నపుడు దగ్గరకు వెళ్ళటానికే భయం వేసేది. వేసంకాలం కాలవలు కట్టేస్తారు కదా - అప్పుడు మోకాలి లోతు నీళ్ళలో గెంతడం మాకు చెడ్డ సరదాగా వుండేది. పొద్దస్తమానం కాలవలోనే నాస్తూ తేల్తూ వుండేవాళ్ళం.

ఎన్నాళ్ళకో కలుసుకున్న నేస్తాలకు, అక్క చెల్లెళ్ళకు కబుర్లు పూరి పోయినట్లుగా మా కందరికీ ఆ గోస్తనది గట్లమీద, మెట్లమీద ముచ్చట్లు పూరేవి, ఏం మాట్లాడుకున్నాం ఆ మాటలకు అర్థమేవిటని యిప్పుడు నన్నడక్కండి. ఆడపిల్లలు వయసొచ్చినా రాకపోయినా ఎన్నో వూసు లాడుకుంటారు. ఒకళ్ళమీ దొకళ్ళు పడి నవ్వుకుంటారు. నదిలోకి దిగినట్టే దిగి దోసిళ్ళతో నీళ్ళు మీద జల్లుకుంటారు. జడల ముడులు విప్పుకుని నదీమతల్లి గుండెలమీద పాయలు పాయలుగా వచ్చి నిన్నటి పుష్పాలను నదిలో విసరివేస్తారు. అవును నిన్నటి పుష్పా లెవరికీ అక్కర్లేదు కదా! నిన్న ఈ చేత్తోనే దేవుడికి పూజ చేసిన పుష్పాలిన్ని యీ వేళ నదిలో కొట్టుకురావటం చూసినపుడు ఎన్నెన్నో ఎంత వింత భావాలు కలిగేవి. నది మీద పసుపూ కుంకుమచ్ఛాయలను పరుచుకుంటూ ఆ పూవులలా కదుల్తూ ప్రయాణం చేస్తూంటే ఒక గొప్ప జీవిత రహస్యాన్ని అవి మనకు చెప్ప టములేదుకదా అనిపించేది. కాలవగట్లమీద చెట్లకొమ్మలు నదిలోనికి వంగి తొంగి చూస్తూన్నట్లుండేవి. మీదనుంచి రకరకాల పక్షులు వలయాలు చుట్టి చిత్రవిచిత్రంగా తిరుగుతూ ఆడుకుంటూంటే వాటిని చూస్తూ, కదిలే మబ్బుల గుంపుల్ని చూపులతో వెంటాడుతూ గంటల తరబడి నీళ్లలో వుండిపోయేవాళ్ళం పెద్దాళ్లొచ్చి కేకవేసే వరకూ.

ఇప్పుడేం వుంది జీవితంలో తల్చుకునేందుకు, తల్చుకుని గర్వ పడేందుకు? ప్రకృతితో చెలిమి చేసేందుకు? ఆ నేస్తాలులేరు, ఆ వయసూ మళ్ళీ రాదు. అప్పుడు మొగ్గ తొడిగిన కోర్కెలూ ఆశలూ అన్నీ ఆ నీళ్ళల్లోనే ఎటో కొట్టుకొనిపోయాయి. నిన్నటి పూజా పుష్పాలలాగ. పంపు తిప్పితే బర్రుమని మొహంమీద చిందే నీళ్ళని చూసి బాయిలర్ని బొగ్గుల కుంపటినీ చూసి గర్వపడేందుకు ఏముంది? తోటలో చెట్లు తోటల్లోనే వున్నాయి. చెట్లమీద పక్షులు వాటి కిలకిలలు, అరుబయట బంగారంలా పరుచుకునే ఎండ, చిన్న చిన్న వాగులూ వాగుల్లో ఆ గులకరాళ్ళూ, మింటను కవ్వించే నవ్వించే మబ్బు కన్యలూ అంతా ఎటో చెప్పకుండా వెళ్లిపోయారు. వారపత్రికల పుటల్లో కాని, సినిమాల్లో కాని, వంటింటి

పొగలో కాని, మనీపర్స్‌లో కాని, ఆఖరికి మకిలి పట్టిన నిలువుటద్దంలో కాని ఆగి ఒక క్షణం నిలబడి తేరిపారజూస్తే కనిపించేది మాసిపోయిన జీవితమే కదా! నదులు, కాలవలూ, చెట్లూ, పడవలూ, పొలంగట్లూ, తోటలూ, దొడ్లూ, వీట్ల మధ్య పెరిగిన అమ్మాయిలకి పార్కుల్లో ప్రకృతి సౌందర్యాన్ని జూలో జంతువుల్నీ, సినిమాల్లో వనదేవతల్నీ చూసి మురిసి పోవాలంటే ఆత్మహత్య చేసుకున్నట్లు వుండదూ? సంతోషాన్ని చెంగున మూటకట్టుకుని తిరిగే ఆడపిల్లలకి నల్లకళ్ళద్దాల నీలినీడలూ, ఎత్తు మడ



మలజోళ్ళు ఏమి ఆనందానివ్వగలవు? జీవితం నుంచి సంతోషాన్ని సంగ్రహించే శక్తి యిప్పటి ఆడపిల్లలకు ఎక్కడుంది? నేచర్ నుంచి విడగొట్టుకున్నాక పల్లెటూరి అమ్మాయిలు అన్నీ పోగొట్టుకున్నారు. నవనాగరికత సోఫిస్టికేషన్ వచ్చి మన కళ్ళకు పొరల్ని కమ్మివేసింది. మనకు దేనికైనా టైంలేదు. వంట్లో ఓపికంత కంటేలేదు. ఈ మధ్యన తల త్రిప్పకుండా గోస్తనదిమీంచి బస్సుల్లో ఎన్నిమాట్లు ప్రయాణం చేయలేదు ? బస్సు రేపే దుమ్ములోనే గతంకూడా కలిసిపోయింది.

మా మ్యారేజ్ కాకముందు, అనగనగా-ఒకానొకప్పుడు వన్సపానె టైమ్ మావారొస్తారొచ్చి (అప్పుడు మీ వారే మా వారు కాదులెండి) నన్ను

తణుకు తీసికెళ్ళారు. అప్పుడు పడవ, బస్సులుండేవి. బస్సుకి బాడీ రవికా వుండేవికావు. సంతరోజుల్లో చింతపండు బుట్టలూ బెల్లం బుట్టలూ కుక్కినట్లు కుక్కేవారు ప్యాసింజర్లని, రవిక తొడుక్కొని అప్పలమ్మలాటి బస్సులో మా వూర్నించి తణుకు వచ్చేం. అప్పుడు యుద్ధం కదా (యుద్ధం ఎవరెవరికి ఎందుకు జరుగుతోందో నాకు తెలీదు) బస్సుకండక్టర్‌కి మమ్మల్నిద్దర్నీ జాగ్రత్తగా చూడమనీ తణుకులో దింపెయ్యమనీ మా ఫాదర్ బస్సువెనకాల పరిగెత్తుతూ మరీ మరీ చెప్పారు. మెళ్ళో గొలుసూ తల్లో చామంతిబిళ్లా జాగత్త జాగత్త అని అమ్మ బస్సులోకి వినపడేలా కేకవేసింది. అది బొగ్గు బస్సు—బొగ్గు బస్సులో బొగ్గుబస్తాల పక్కసీట్లో మా కాబోయే కళ్యాణ దంపతుల్ని బస్సు వాడు ఒకరి వళ్లో ఒకరు కూర్చునేలా ఏర్పాటు చేశాడు. ఆరేంజి మెంటంతా నైసుగా లౌలీగానే వుంది కాని ఆ బొగ్గు బస్సులోంచి మేం దిగినపుడు మా అత్తయ్య మమ్మల్ని చూసి ఆశ్చర్యపడిపోయి ముక్కున వేలేసుకుంది. మూడు తలంట్లయాక కానీ నా అసలు రంగు బయట పడలేదు, మా వారప్పుడు ఫిప్తుఫారం చదువుతున్నారు. కెమిస్ట్రి సబ్జక్టు- నాలుగడుగుల తొమ్మిది దంగుళాల మహా పురుషుడు. నేనేమో ఫోర్ ఫీటు టూ ఇంచస్. ఇప్పుడు మేమిద్దరం సేంహైటే ననుకుంటా- అప్పుడు మావారు స్మాల్‌బోయ్ విత్ నిక్కర్స్ అండ్ హాఫ్ షర్ట్స్—ఐయాం పరికిణీలు అండ్ వోణీస్ మా అత్తయ్యే ఒకరోజు వోణీ తెప్పించి నాచేత వేయించింది. అఫ్‌కోర్స్ అప్పుడు అందరూ నా వోణీ పుచ్చుకులాగడవే-నాకు విసుగొచ్చి పీకి అవతల పారేసి పోయి ఆడుకునేదాన్ని. స్మాల్‌గరల్ని కదా, ఫోర్ ఫీట్ టూ ఇంచసే కదా నాకెందుకు చెప్పండి అప్పర్‌క్లాత్ - తనకు ప్యాంట్ కుట్టించకుండా నాకు ఓణీ మా అత్తయ్య కొన్నందుకు మావారు కారమ్స్ అండ్ మిరియమ్స్ నూర్తూ ఉండేవారు. అప్పుడు టు మేరీ దిస్ బోయ్ ఆర్ నాట్ టు మేరీ అనుకునేదాన్ని బొగ్గుబస్సులో తీరా వొళ్ళో కూచున్నాను కదా, పెళ్ళాడకపోతే మనకంటే అగ్గిదేవత్తో బావగార్ని పెళ్లాడేసిందంటే మనకు ఇన్సల్టు జరిగిపోదూ ? గోస్తనదిలో మొగపిల్లల్తో చేరి యీతలు కొట్టినందుకు సడెన్‌గా బొగ్గు బస్సులో వచ్చిన మా ఫాదర్ యాంగ్రీ అగ్నిహోత్రుడయి టామరిండ్ బరి

కతో వీపుమీద కొట్టిన దెబ్బలు, వాటి తాలూకు మచ్చలు యింకా నా వీపు మీద అలాగే వున్నాయి. నేను నా వీపుమీద మచ్చలు చూపిస్తే మా వారు రోడ్డుమీద పరిగెత్తలేక స్కూల్నించి వస్తూ పడిపోయి దొక్కుపోయిన మోకాలిమీద మచ్చలు గడ్డం కింద మచ్చలు చూపిస్తారు. ఎలాగైనా శరీరానికి కలిగిన మచ్చలు మచ్చలే కదా - అవి జీవితాంతం వుండిపోతాయి అని చిన్నథీరీని పైకిలాగాను టోపీలోంచి పిల్లిని బైటకు లాగినట్లు. అప్పుడు గోస్తనదిలో ఈవలనుంచి ఆవలకు ఈదాలని ప్రయత్నించిన నేను ఇప్పటికీ జీవితం ఈదలేక పోతున్నాను. దీనికి అవలిగట్టు అనేది వుందా - వుంటే కనపడదేమి? నేను ములిగీత్తున్నాను. మా వారు బారీత యీత్తున్నారు. గోస్తనదిలా ప్రతి గుమ్మంవద్ద నిలబడి చిరునవ్వులు నవ్వుతూ పలకరిస్తూ మా జీవనయాత్ర వంకర టింకరగా, టింకర వంకరగా సాగిపోతోంది. ఇప్పుడు నీళ్ళను చూస్తే నాకు భయం, ఎప్పుడైన స్నానానికి వెళ్ళినా (వెళ్ళను) మెట్లమీదే కూర్చుని చెంబుతో రెండు నీళ్ళు తలమీద పోసుకుని మళ్ళీ వచ్చి పంపుకింద కూర్చుంటాను. ఇప్పటికైనా బోధపడిందా- లేదూ మీదీ మట్టిబుర్రే నన్నమాట మావారిలాగ.... అరిగోషటప్‌గారొస్తున్నారు. (వేర్ ది మైండీజ్ వితవుట్ ఫియర్ అని చదువుతున్నాడు పెద్దపిల్లాడు) అవును వేర్ ది మైండ్ ఈజ్....